క్లుప్తంగా

డ్రైనేజీలో చెత్త తొలగింపు



దుర్గాలమ్మ గుడి జంక్షన్‌లోని డ్రైనేజీలో చెత్త తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

జగదాంబ : పూర్ణామార్కెట్‌లోని దుర్గాలమ్మ గుడి జంక్షన్‌లో మురుగు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం జీవీఎంసీ 35వ వార్డు శానిటరీ సెక్రటరీ పర్యవేక్షణలో సిబ్బంది డ్రైనేజీలో చెత్త తీసి శుభ్రం చేశారు. దీంతో మురుగు నీరు ఎగువకు ప్రవహించి దుర్గాసన సమస్య తొలగటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. సకాలంలో స్పందించి సమస్య పరిష్కరించిన జీవీఎంసీ సిబ్బందిని స్థానికులు అభినందించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దివంగత నటుడు శోభన్‌బాబు అభిమానులు

దాబాగార్డెన్స్ : దివంగత సినీ నటుడు శోభన్‌బాబు పెళ్లిరోజును పురస్కరించుకుని డాబాగార్డెన్స్‌లో గల ఆయన విగ్రహం వద్ద అభిమానులు బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ముందుగా శోభన్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిటీ వైడ్ శోభన్‌బాబు అభిమానుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు అభిమానులు పాల్గొన్నారు.

వ్యవస్థాపక సభ్యుడికి ఘన నివాళి



దూడ రాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు

దాబాగార్డెన్స్ : స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక సభ్యుడు దూడ రాజు ప్రథమ వర్ధంతి బుధవారం సంస్థలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, పలువురు సభ్యులు దూడ రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజు సంస్థకు అందించిన సేవలను అతిథులు కొనియాడారు. అనంతరం పేదలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సత్తిబాబు, అప్పలకొండ, ముత్యాలు, సీహెచ్ పైడిరాజు, డి. లక్ష్మణ, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

19న కుంతీ మాధవ స్వామి చందనోత్సవం



కుంతీ మాధవ స్వామి విగ్రహం

పద్మనాభం : పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో స్వామి చందనోత్సవం ఈ నెల 19న నిర్వహించనున్నట్టు ఈవో నానాజీ బాబు తెలిపారు. 18న రాత్రి పది గంటలకు కుంతీ మాధవ స్వామి విగ్రహాన్ని చందనంతో అలంకరిస్తారు. 19న ఉదయం ఆరు గంటల నుంచి చందనం అలంకరణలో ఉన్న కుంతీ మాధవ స్వామిని దర్శించుకోవడానికి భక్తులకు ప్రవేశం కల్పిస్తారు.



రంగులద్దిన స్టేడియం గ్యాలరీ



స్టేడియం చుట్టు నిర్మించిన తారు రోడ్డు



చిన్నారుల కోసం ప్లే ఏరియా

మైదానానికి మహర్దశ

- రూ. 2 కోట్లతో ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం అభివృద్ధికి చర్యలు
- హర్షం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు



అభివృద్ధి జరగక ముందు ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం

జగదాంబ : గతంలో ఎన్నో అంతర్జాతీయ క్రీడలకు వేదికగా నిలిచిన ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం ఆ తర్వాతి కాలంలో శిథిలావస్థకు చేరుకుంది. సరైన నిర్వహణ లేక పాడుబడి.. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారికి, మందుబాబులకు నిలయంగా మారింది. దీంతో స్థానిక క్రీడాకారులు ప్రాక్టీస్ చేసుకునే అవకాశం కూడా లేకుండా పోయింది. అలా చాలా కాలం స్టేడియం శిథిలంగానే ఉండిపోయింది. అయితే తాజాగా జీవీఎంసీ కమిషనర్ చొరవతో స్టేడియం అభివృద్ధి బాట పట్టింది.



అభివృద్ధి పనులు చేపట్టిన తర్వాత స్టేడియం



వాకర్ల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్

రూ. 2 కోట్లతో అభివృద్ధి పనులు..

సుమారు రూ. 2 కోట్ల నిధులతో స్టేడియం అభివృద్ధికి పనులు చేపట్టారు. ప్రధాన ద్వారాలు, రెయినీబో గ్యాలరీ, పెవిలియన్ బాక్స్, స్కోరు బోర్డు, రహదారులు, కాలువలు, స్టేడియం చుట్టు ఆహ్లాదం పంచే పూలమొక్కల ఏర్పాటు, విద్యుత్ వెలుగులు, చిన్నారుల కోసం ప్లే ఏరియా, యువకులు, మహిళల కోసం ఓపెన్ జిమ్, ఇండోర్ గేమ్స్ ఏరియా, షటిల్, బాస్కెట్‌బాల్, స్నూకర్, బాక్సింగ్ రింగ్, గ్యాలరీ చుట్టు ఇనుప ఫెన్సింగ్, మరుగుదొడ్లు, ల్యాండ్ స్కేపింగ్, మినీయేచర్స్, కూర్చునేందుకు బల్లలు, కార్లు పార్కింగ్ చేసుకునేందుకు సరిపడే స్థలం అభివృద్ధి వంటి సదుపాయాలు కల్పించి స్టేడియం పూర్వవైభవానికి కృషి చేస్తున్నారు.



కొత్తగా నిర్మిస్తున్న పెవిలియన్ బాక్స్



గ్యాలరీ ముందు ఏర్పాటు చేసి ఇనుప ఫెన్సింగ్

తాటిముంజలకు భలే గిరాకీ

- డజను రూ.50 నుంచి రూ.60
- ఆసక్తి చూపుతున్న ప్రజలు

అల్లిపురం : వేసవి వచ్చిందంటే చాలు.. అందరికీ గుర్తుకు వచ్చేవి తాటికాయలు. నగరంలో తాటికాయలు దొరకడం కష్టం కావడంతో నగర శివార్లు అయిన ఆనందపురం, తగరపువలస, పెందుర్తి, చింతల అగ్రహారం, కొత్తవలస తదితర ప్రాంతాల నుంచి గీత కార్మికులు తీసుకొచ్చే తాటిముంజలకు జనం ఎగబడుతున్నారు. దొండపర్తి డీఆర్‌ఎం కార్యాలయం రోడ్డులో తాటిముంజల వ్యాపారులు వాటిని విక్రయిస్తున్నారు. డజను రూ.50 నుంచి రూ.60 వరకు వీటి ధర పలుకుతోంది. వేసవి వేడికి తాటిముంజలు ఉపశమనం కావడంతో జనం వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.



డీఆర్‌ఎం కార్యాలయం వద్ద తాటిముంజలు అమ్ముతున్న గీత కార్మికులు

కూచిపూడిలో సత్తా చాటిన ప్రణవి



క్లాన్‌క్లేవ్-2024లో విజేతగా నిలిచిన ప్రణవి

దాబాగార్డెన్స్ : నగరానికి చెందిన చిన్నారి పినిశెట్టి ప్రణవి కూచిపూడి నృత్యంలో అద్భుత ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచింది. ఇటీవల అంతర్జాతీయ స్థాయిలో థాయిల్యాండ్‌లోని అలెయన్స్ ప్రావిన్స్‌లో జరిగిన కల్చరల్ క్లాన్‌క్లేవ్-2024లో కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి విజేతగా నిలిచింది. ఇప్పటికే ఎన్నో అవార్డులు, పతకాలు సాధించిన ఈ చిన్నారి భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు గెలవాలని గురువు కూచిపూడి నాగచందన ఆకాంక్షించారు. ఆరేళ్ల వయస్సు నుంచి ప్రణవి కూచిపూడి నృత్యం చేస్తూ మంచి ప్రదర్శనలు ఇచ్చిందంటూ చిన్నారి తల్లిదండ్రులు పినిశెట్టి రమేష్‌బాబు, నవ్యను పలువురు అభినందించారు.

చేతి బోర్లకు మరమ్మతు చేయరూ..



బంగారుమెట్టలో పని చేయని బోరింగ్



కుమ్మరవీధిలో నిరుపయోగంగా పడి ఉన్న బోరింగ్

అల్లిపురం : వేసవిని దృష్టిలో పెట్టుకుని జోన్-4 పరిధిలో గల చేతి బోర్లకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. నీటి ఎద్దడి రాక ముందే తగిన చర్యలు చేపట్టాలంటున్నారు. జీవీఎంసీ 32,33,34 వార్డుల్లో చాలా చోట్ల చేతి బోరింగులు మరమ్మతులకు గురి కావటంతో పని చేయడం లేదు. కొన్ని చోట్ల పని చేస్తున్నా బేస్‌మెంట్లు సరిగ్గా లేక నీళ్లు పట్టుకునే పరిస్థితి లేదు. అలాంటి చోట బేస్‌మెంట్లు సరి చేయాలని స్థానికులు వేడుకుంటున్నారు. మరికొన్ని చోట్ల హ్యాండిళ్లు పని చేయక ఎంత తోడినా నీరు రావటంలేదు. ప్రతిచోట బోరింగ్‌లను పరిశీలించి వాటికి మరమ్మతులతో పాటు ఒకసారి ఆయిలింగ్ చేయించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. తద్వారా వేసవిలో మంచి నీటి ఎద్దడి ఉండదంటున్నారు.

బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలకు వేళాయె..



శ్రీనివాసుడు

పెందుర్తి: బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలకు పెందుర్తి వెంకటాద్రి సిద్ధమైంది. శ్రీనివాసుడు పద్మావతి అమ్మవారిని వివాహమాడేందుకు భూమిపై అడుగిడిన పవిత్రమైన రోజు వైశాఖ శుద్ధ దశమి నాడు ఏటా బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. పెందుర్తి వెంకటాద్రి నిర్మాణానికి కూడా వైశాఖ శుద్ధ దశమి నాడే తొలి అడుగు పడింది. ఈ క్రమంలో ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహించి వెంకటాద్రిపై వైశాఖ శుద్ధ దశమి (శనివారం) నాడు కల్యాణం చేస్తారు. ఈ క్రమంలో వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఐదు రోజులపాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు విష్వక్సేనపూజ, అంకురార్పణ జరుగుతుంది. రెండో రోజు శుక్రవారం ఉదయం ధ్వజారోహణ, హోమాలు చేస్తారు. సాయంత్రం లక్ష తులసి, మల్లికా పుష్పాలతో స్వామివారికి విశేష అర్చనలు జరుగుతాయి. మూడోరోజు శనివారం వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా సాయంత్రం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. నాలుగో రోజు ఆదివారం సాయంత్రం తిరువీధి ఉత్సవంలో భాగంగా స్వామివారి రథోత్సవం సాగనుంది. వెంకటాద్రి నుంచి పెందుర్తి పురవీధుల్లో స్వామివారు రథంపై పయనిస్తూ చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలమేలు మంగమ్మ సన్నిధి వరకు భక్తులకు ఆశీస్సులు అందిస్తారు. ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామివారి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు. భక్తులంతా తరలిరావాలని కోరారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వెంకటాద్రిపై ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కోదండ రాముడి పుష్పయాగానికి పూలు తరలింపు

ఎంవీపీ కాలనీ: తిరుపతి శ్రీకోదండ రాముడి పుష్పయాగానికి విశాఖ నుంచి పూలు తరలివెళ్లాయి. ఆధ్యాత్మిక వేత్త హిమాంశు ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లాలలోని వివిధ ప్రాంతాలలో సేకరించిన పూలును బుధవారం ఎంవీపీలోని టీటీడీ ఈ-దర్శనం కౌంటర్ వద్ద భక్తుల సందర్శనార్థం ప్రదర్శించారు. తిరుమలలో ఉత్సవాల్లో భాగంగా జరిగే పుష్పయాగానికి ఈ పూలు తరలిస్తున్నట్లు హిమాంశు ప్రసాద్ తెలిపారు. కలువలు, తామరలు, తులసి, మల్లి ఇలా వివిధ రకాలకు చెందిన 15 వేల పూలను సేకరించామన్నారు. ఈ పూలకు సంకల్పం చేసి అనంతరం బుధవారం సాయంత్రం తిరుమల తరలించామన్నారు. ఈ కార్యక్రమంలోమ పలువురు ఎంవీపీ వాసులు, వెంకటేశ్వస్వామి భక్తులు పాల్గొన్నారు.

జోరుగా విశ్లేషణలు.. అంచనాలు

- అభ్యర్థుల గెలుపోటములపై పెద్ద ఎత్తున నడుస్తున్న చర్చలు

దాబాగార్డెన్స్ : సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో ఏ పార్టీ గెలుస్తుంది? ఏ అభ్యర్థి విజయం సాధిస్తారనే ఉత్కంఠ అందరిలో నెలకొంది. వివిధ పార్టీల అభ్యర్థులు విజయం సాధిస్తారని.. ఇంత మెజారిటీ వస్తుందని ఔత్సాహికులు ఏవేవో విశ్లేషణలు చేస్తూ చెబుతున్నారు. ప్రస్తుతానికి ఎన్నికల ఫలితాలకు దాదాపు 20 రోజుల సమయం ఉన్నందున ఎవరేం చెప్పినా ఉత్కంఠ అలాగే కొనసాగక తప్పదు. ఫలితాల గురించి చెప్పేవారు పలు సర్వేలను ఆధారం చేసుకుని.. కొంత కల్పన జోడించి చెబుతుండడంతో వినేవారు ఆసక్తి వ్యక్తం చేస్తున్నారు.

ఎవరి వాదనలు వారివి..

సుమారు రెండు నెలలుగా దక్షిణలో అసెంబ్లీ అభ్యర్థుల తరపున అనుచరులు చేసిన హడావిడి అంతా ఇంతా కాదు. ఈ నెల 13న జరిగిన పోలింగ్‌తో ప్రచారాలకు బ్రేక్ పడింది. ఇప్పుడు ఊహాగానాలు, విశ్లేషణలు కొనసాగుతున్నాయి. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపోటములపై జోరుగా చర్చ నడుస్తోంది. పోలింగ్ బాగా జరిగిందని, ప్రజలు తమ పార్టీకే ఎక్కువ ఓట్లు వేశారని ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

అనుచరులు.. అభిమానుల ధీమా..

తమ నాయకుడే గెలుస్తాడని జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ అనుచరులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు అందుకున్న వారంతా వైఎస్సార్‌సీపీకే ఓటు వేశారని, అందుకే వాసుపల్లి గణేష్‌కుమార్ మరోసారి ఎమ్మెల్యేగా గెలవబోతున్నారంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు ధీమాగా ఉన్నారు. ఏది ఏమైనా జూన్ 4 వరకు ఈ ఉత్కంఠ ఇలాగే కొనసాగనుంది.

ఎండల జోరు.. జనం బేజారు

- ఉష్ణతాపానికి విలవిల్లాడుతున్న జనం
- నిర్మానుష్యంగా రహదారులు
- వ్యాపారాలు సాగక చిరు వర్తకుల గగ్గోలు



ఎండకు ఉపశమనంగా తాగేందుకు నీళ్లు పట్టుకుంటున్న మహిళ



నిర్మానుష్యంగా జనతా బజార్ రహదారి

జగదాంబ : భానుడి భగభగలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గత కొన్ని రోజులుగా ఎండలతో జనం విలవిల్లాడుతున్నారు. బయటికి రావడానికి కూడా ధైర్యం చేయటంలేదు. బుధవారం ఉష్ణతాపం మరింత ఎక్కువ కావటంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే ప్రాంతాలు కూడా మనుష్య సంచారం లేకుండా దర్శనమిచ్చాయి. రోడ్లపై వాహనాలు, పాదచారుల రాకపోకలు దాదాపు కనిపించలేదనే చెప్పాలి.



గొడుగుల మాటున చిరు వ్యాపారులు

ఎండకు పువ్వులు వాడిపోతున్నాయి..



మాది మార్కెట్‌లో పువ్వుల వ్యాపారం. ఏ సంవత్సరం లేని ఎండలు ఈ ఏడాది కాస్తున్నాయి. దీంతో బయటికి రావడానికి కూడా జనం భయపడిపోతున్నారు. ఈ ఎండకి వ్యాపారం కోసం తీసుకు వచ్చిన పువ్వులు వాడిపోతున్నాయి. లాభం సంగతి అటుంచితే పెట్టుబడి కూడా వచ్చేటట్లు లేదు.

– వెంకట సత్యవతి, పూల వ్యాపారి, పూర్ణామార్కెట్

వ్యాపారం సాగటంలేదు..



ఈ ఏడాది ఎండలు విరగకాస్తున్నాయి. ఈ ఎండలకు మా చేపల వ్యాపారం ఏమాత్రం సాగటంలేదు. ఇప్పటికే రెండు నెలల వేట నిషేధంతో బోట్లు సముద్రంలోకి వెళ్లక వ్యాపారం సాగలేదు. ఇప్పుడు ఎండల పుణ్యమా అని పూర్తిగా వ్యాపారం పడిపోయింది.

– పీర్లమ్మ, చేపల వ్యాపారి, పూర్ణామార్కెట్

కూరగాయలు స్టాక్ పెట్టుకోవడంలేదు..



నిత్యం రద్దీగా ఉండే పూర్ణామార్కెట్ ఎండల కారణంగా కొనుగోలుదారులు లేక నిర్మానుష్యమైపోయింది. ఎండకి జడిసి ఎవరూ మార్కెట్‌కు రావటంలేదు. అందుకే కూరగాయలు స్టాక్ పెట్టుకోవటంలేదు. అలా చేస్తే వేడికి కూరలు పాడైపోతున్నాయి.

– బాలు, కూరగాయల వ్యాపారి, పూర్ణామార్కెట్

వీరభద్ర విజయం.. విశిష్ట కావ్యం



మాట్లాడుతున్న ఆచార్య అయ్యగారి సీతారత్నం

సీతంపేట: సహృదయ సాహితీ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో బుధవారం 'పోతన వీరభద్ర విజయం' అనే అంశంపై ఆంధ్రా యూనివర్సిటీ ఆచార్యులు డాక్టర్ అయ్యగారి సీతారత్నం ప్రసంగం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోతన వీరభద్ర విజయం భాగవతానికి ముందే రాశారని ఆరుద్ర నిరూపించారన్నారు. పోతన ఈశ్వర భక్తి ఈ కావ్యంతో స్పష్టమవుతుందని, అనంతర కాలంలో భాగవతం రాసేటప్పటికీ ఏకేశవరోపాసన హరిహర అభేదం తెలుస్తుందన్నారు. వీరభద్ర విజయంలోని పద్యాలను పరిశీలిస్తే పోతన శైలి, శబ్దాలంకార ప్రీతి సుస్పష్టమవుతుందన్నారు. లాటానుప్రాసం, వృత్యానుప్రాసం అద్భుతంగా ప్రయోగించారని చెప్పారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ వీరభద్ర విజయం మంచి కవిత్వ పటుత్వంతో రాసిన కావ్యమని తెలిపారు. దీని మూలం వాయు పురాణంలోనిదన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ పోతన రాసిన వీరభద్ర విజయం శైవమత ప్రధాన మైనదని, శివుడి జటాజూటం నుంచి ఉద్భవించిన వీరభద్రుడు, దక్షుని సంహరించుట ప్రధాన ఇతివృత్తమని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.జి.వేణు, ఎస్.విజయ్‌కుమార్, పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

అన్నదాన సేవలకు రెండేళ్లు

తాటిచెట్లపాలెం: రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా ఉన్న షిర్డీసాయి బాబా ధ్యాన మందిరంలో నిరంతర అన్నదానం కోసం ఏర్పాటు చేసిన కమ్యూనిటీ ఫ్రిజ్‌లకు రెండేళ్లు పూర్తయ్యాయి. రెండేళ్లుగా ప్రతి రోజు కనీసం 50 నుంచి 100 మంది ఆకలి తీర్చగలిగినందుకు తమకెంతో సంతోషంగా ఉందని ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు శేష గిరిరావు, రాంబాబు తెలిపారు.

ఆధ్యాత్మిక భావాలు అలవరచుకోవాలి

కొమ్మాది : నేటి తరం యువత ఆధ్యాత్మిక భావాలు అలవరచుకోవాలని సుందర్ గోపాల్ ప్రభు సూచించారు. భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో రెండో రోజు నిర్వహించిన ఇస్కాన్ ఇండియా యూత్ కౌన్సిల్ (ఐఐవైసీ) సమావేశంలో బుధవారం ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందికి సనాతన ధర్మాన్ని బోధించే కార్యక్రమంలో భాగంగా ఈ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆధ్యాత్మిక భావాలు మనిషిని కష్ట సుఖాల్లో నిలబెడతాయని, మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఇస్కాన్ ఆలయంలో గల శ్రీ రాధాకృష్ణులకు, జగన్నాథ, సుభద్ర, బలభద్ర స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భాగవత ప్రవచనాలు ఉదయం 4.30 గంటల నుంచి ప్రత్యేక హారతి కార్యక్రమాలు, నగర సంకీర్తన నిర్వహించారు. సమావేశాల్లో స్వామీజీ పరివ్రాజిక స్వామి మహారాజ్, రాధే శ్యామ్ ప్రభు, సాగర్‌నగర్ ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని తదితరులు పాల్గొన్నారు.